
డ్రోన్ షోకు సిద్ధమవుతున్న టెక్నీషియన్

ఎల్ఈడీ స్ర్కీన్లతో సిద్ధమైన అతిథులు వెళ్లేదారి



ఫ్యూచర్ అదిరేలా..

బీఎఫ్‌సీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీ(బీఎఫ్‌సీ)లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు ఆతిథ్యం అదిరేలా ఏర్పాట్లు చేశారు. సమ్మిట్ ప్రాంతంలోని రోడ్లన్నీ స్వాగత తోరణాలతో కళకళలాడుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన వేదికలను పూలమొక్కలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. 25శాఖల ముఖ్య అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నేడు(సోమవారం) మధ్యాహ్నం సమ్మిట్ అట్టహాసంగా ప్రారంభం కానుంది.



ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధీనంలో..

గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణం ఆదివారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఇందులోకి పాస్‌లు లేని వారిని అనుమతులు ఉండవని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. సమ్మిట్ జరిగే మీర్కాన్‌పేట, బేగరకంచె గ్రామాల్లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీపట్నం ఏసీపీ రాజు తెలిపారు. సోమవారం, మంగళవారం కందుకూరు మండల కేంద్రం నుంచి మీర్కాన్‌పేట మీదుగా యాచారం వెళ్లే ప్రయాణికులను దారి మళ్లించినట్లు తెలిపారు. ఈ రోడ్డుపై నుంచి కాకుండా వాహనదారులు హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారి రాచులూరు గేటు నుంచి రాచులూరు, గుమ్మడవెల్లి గ్రామం మీదుగా ఆకులమైలారం, మీర్కాన్‌పేట గ్రామానికి వెళ్లాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల పాటు పోలీసులకు సహకరించాలని వారు కోరారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రైతులకు హెచ్ఎండీఏ తరహాలో ఏర్పాటు చేసిన వెంచర్‌ను పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నట్లు వారు తెలిపారు.



- ప్రాంగణమంతా డిజిటల్ మయం
- స్వాగత తోరణాలతో రహదారులన్నీ కళకళ
- హాజరుకానున్న 3 వేల మంది అతిథులు
- గెస్టులకు గుర్తుండేలా ప్రత్యేక వంటకాలు
- పోలీస్ పహారాలో ఆర్థిక సదస్సు ప్రాంగణం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, పొన్నం
- అట్టహాసంగా నేడు గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/మహేశ్వరం/కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ ప్రపంచలోనే రోల్ మోడల్‌గా నిలిచేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్కాన్‌పేట - బేగరికంచలోని భారత్ ఫ్యూచర్‌సిటీ వేదికగా సోమవారం మధ్యాహ్నం గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం కానుంది. దేశ, విదేశాల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, సినీ, క్రీడా, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, విద్యారంగాలకు చెందిన ప్రముఖులు, విదేశీ రాయబారులు, ఆయా దేశాలకు చెందిన నిష్ణాతులు ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు. ఆదివారం రాత్రి వరకు మంత్రులతో పాటు 26 శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ.. సభా వేదికకు తుది మెరుగులు దిద్ది ఏర్పాట్లు పూర్తి చేశారు. 'తెలంగాణ రైజింగ్ థీమ్'తో ప్రపంచ

మిగతా 6వ పేజీలో...




సమ్మిట్ ప్రాంగణంలో చివరి దశలో ఏర్పాట్లు


అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

ఆర్టీఏ అధికారులతో సమీక్ష

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులతో ఆదివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఆ శాఖకు సంబంధించిన సమస్యలు ఇతరాత్ర అంశాలపై ఆయన మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీవో వెంకట్‌రెడ్డి, ఎంవీఐ, ఆర్టీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

3,678 నామినేషన్లు

7

- పూర్తయిన నామినేషన్ల పరిశీలన
- ఆరు వార్డుల నామినేషన్ల తిరస్కరణ
- 157 సర్పంచ్ స్థానాలకు 740, 1,340 వార్డులకు 2,938 మంది పోటీ

కోతుల బెడద పట్టని ప్రభుత్వం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 2014 నుంచి 2021 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల కోతులు ఉంటే 300 కోతులు పట్టడం ఏమిటని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఆయన ఆదివారం వికారాబాద్ మార్కెట్ కార్యాలయ ఎదుట కోతులను పట్టుకునే ట్రక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి గొప్పగా మాట్లాడారని ఆర్టీఏ ద్వారా లెక్కలు అడిగితే మొత్తం రాష్ట్రంలో 719 కోతులను పట్టుకున్నారని, అందులో 389 కోతులకు ఆపరేషన్ చేసి వదిలి పెట్టారని తెలిసిందన్నారు. ఈ విషయమైన కలెక్టర్, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి కొత్త ట్రక్‌ను కోతులు పట్టేందుకు ఏర్పాటు చేశామన్నారు. నిత్యం కొన్ని గ్రామాల్లో ట్రక్ తిరిగి కోతులను పట్టుకుని వాటిని ఎక్కడైనా అడవుల్లో విడిచి పెడతారన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు శివరాజ్ గౌడ్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, గెలిచిన గ్రామాలకు ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షల నిధులు ఇస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు, రైతులకు ధోకా చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అప్పుల పాలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమైనా చేస్తుందా అంటే రెండు ఏళ్లకు ఎన్నికలకు వచ్చిందన్నారు. గ్రామాల్లో వారికి అనుకూలంగా ఉందనుకుంటున్నారు కానీ గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ వద్దంటున్నారన్నారు. సర్పంచ్ పదవి కూడా పోటీ చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ప్రతి నయా పైసా మోదీ వల్లనే గ్రామాలకు వస్తున్నాయన్నారు. బీజేపీ ద్వారానే గ్రామాలు అభివృద్ధి జరుగుతుతాయని బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాదవరెడ్డి, నాయకులు శివరాజ్ గౌడ్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోతులు పట్టుకునే ట్రక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా

లక్ష్మాపూర్‌ను పట్టించుకోని కేసీఆర్

జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



శామీర్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ రైతుల భూ సమ్యస్యలు పరిష్కరిస్తామని చెప్పిన అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం మండలంలోని అలియాబాద్, మూడుచింతలపల్లి మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మాపూర్‌లో పదేళ్లుగా రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాక రైతులు నరకయాతన పడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి తెచ్చినా పరిస్థితి అలాగే ఉందన్నారు. పట్టా భూములను కూడా అసైన్డ్ భూములుగా నమోదు చేశారని ఆరోపించారు. లక్ష్మాపూర్‌లో రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యేదాకా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. 'నా బాట పూల బాట కాదు.. ముళ్ల బాట అని తనకు తెలుసని, అయినా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. 'జాగృతి జనం బాట'లో ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నా నన్నారు. అనంతరం లక్ష్మాపూర్ మహిళలతో కాసేపు ముచ్చటించారు.

మర్పల్లిలో ఇటీవల నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనం



రామలింగేశ్వరుడి సేవలో మంత్రి పొన్నం

కీసర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో ఆయనకు అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదములు, శేష వస్త్రములు, ఆశీర్వచనలు అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, శర్మ, ఫౌండర్ సభ్యులు, ఈవో సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.


స్వామి సేవలో మంత్రి పొన్నం

పక్కాగా వైద్యం

- ఉమ్మడి జిల్లాలో 72 కేంద్రాలకు నిర్మాణం
- రంగారెడ్డి జిల్లాలో 55, వికారాబాద్ జిల్లాలో 17
- రూ.14.38కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం


ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు సొంత భవనాలు నిర్మించనున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 72 ఆరోగ్య ఉప కేంద్రాలను రూ.14,38,56,000 నిధులతో నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లాలో 55, వికారాబాద్ జిల్లాలో 17 ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించనున్నారు. ఈ నిర్మాణాల పనులు చేపట్టేందుకు రంగారెడ్డి జిల్లాకు రూ.10,98,90,000, వికారాబాద్ జిల్లాకు రూ.3,39,66,000 చొప్పున నిధులను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఒక్కో కేంద్రానికి రూ.19.98 లక్షలు

వికారాబాద్ జిల్లాలో తాండూరు నియోజకవర్గంలో 6, వికారాబాద్ నియోజకవర్గంలో 6, కొడంగల్ నియోజకవర్గంలో 2, పరిగి నియోజకవర్గంలో 2, చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోకి వచ్చే నవాబ్‌పేట మండలంలో ఒక ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల నియోజకవర్గంలో 15, ఇబ్రహీంపట్నంలో 13, రాజేంద్రనగర్‌లో 13, మహేశ్వరంలో 7, శేరిలింగంపల్లిలో 4, కల్వకుర్తిలో 2, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఒకటి చొప్పున నిర్మించనున్నారు. జిల్లాల వారీగా ప్రభుత్వం కేటాయించిన నిధులను పీఆర్ ఆర్ఈ అధికారులు జెడ్పీ ఖాతాలకు

మిగతా 7వ పేజీలో...




జ్ఞానమాల కార్యక్రమంలో వజ్రేశ్ యాదవ్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కీసర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. ఆదివారం కీసర ప్రధాన చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి 200వ వారం జ్ఞానమాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ అంబేడ్కర్ చిరస్మరణీయుడని, ఆయన ఎంతో దూరదృష్టితో రాజ్యాంగ రచించారన్నారు. ఆ మహనీయుడి రాసిన రాజ్యాంగంలోని చట్టాలతో, రిజర్వేషన్లతో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్ని రంగాలలో సముచిత స్థానం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఘట్‌కేసర్, ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో ఆదివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాలొని తిలకించారు. లోక కల్యాణం కోసం సుదర్శన హోమం నిర్వహిస్తున్నామని, వర్షాలు సంవృద్ధిగా కురిసి, పాడిపంటలు పండాలని ఆలయ ధర్మకర్తలు కోరుకున్నామన్నారు. భక్తులు ఇచ్చే కట్నకానుకలు, డబ్బులు ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్య, గాజులు, పూలు సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు

భగవంతుడి నామస్మరణలో ఉండాలి

కేశంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సుఖాలకు పోకుండా భగవంతుడి నామస్మరణలో ఉండాలని ముక్తేశ్వరానంద స్వామి అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన పల్లాటి కృష్ణయ్య నివాసంలో ఆదివారం కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం, భగవద్గీత యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవిత పరమార్థం తెలియాలంటే విష్ణు సహస్ర నామ పారాయణం చేయాలన్నారు. 30 ఏళ్లుగా తొమ్మిదిరేకుల కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో గీత యజ్ఞం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముక్తేశ్వరానంద స్వామి



వేదిక వద్దకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన గ్రీనరీ

200 మంది వలంటీర్లతో సేవలు

అతిథులకు సౌకర్యాలను కల్పించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సేవలందించే ఈవెంట్ సంస్థ ఆధ్వర్యంలో 200 మంది వలంటీర్లను సిద్ధం చేశారు. వీరంతా కూడా ఆదివారం రాత్రి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రాంగణంలోని సభావేదికలను పరిశీలించారు. ప్రధానంగా సమావేశాలు నిర్వహించే సభావేదికలతో పాటు డైనింగ్ హాళ్లు, తదితర ప్రాంతాల్లో వారు సేవలందించనున్నారు.

ఫ్యూచర్ అదిరేలా..

(ఐదో పేజీ తరువాయి)

వ్యాపార దిగ్గజాలను పెట్టుబడులు ఆకట్టుకునేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేదికలను సిద్ధం చేసింది. ఈ సదస్సుకు ఆరు ఖండాలు, 44 దేశాల నుంచి పారిశ్రామిక దిగ్గజాలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు తెలంగాణలో నెలకొల్పేలా విజన్- 2047 సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను కళ్లకు కట్టినట్టుగా వివరించేందుకు సభా ప్రాంగణంలో భారీ స్థాయిలో ఎల్ఈడీ స్ర్కీన్లను ఏర్పాటు చేసింది. దేశ, విదేశాల నుంచి 1,500 మంది వరకు పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు, మరో 1,500 మంది అతిథులు ఈ సమ్మిట్‌లో పాల్గొనున్నారు. వీరికి అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు చేపట్టారు. అతిథుల కోసం ప్రత్యేకంగా భోజనశాలలను ఏర్పాటు చేశారు.



విద్యుత్ వెలుగులో గ్లోబల్ సమ్మిట్ ముఖ ద్వారం

పటిష్టంగా కమ్యూనికేషన్ వ్యవస్థ

సమ్మిట్ జరిగే ప్రాంగణమంతా పచ్చని అందాలతో తీర్చిదిద్దారు. పూల మొక్కలు, పచ్చని గడ్డిని ఏర్పాటు చేశారు. అతిథుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదికను సిద్ధం చేశారు. వ్యాపార దిగ్గజాలు హెలీక్యాప్టర్లు, విమానాల్లో దిగేందుకు మూడు హెలీప్యాడ్లను ఏర్పాటు చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా ప్రత్యేకంగా సెల్ టవర్లను నెలకొల్పింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం జరక్కుండా జనరేటర్లు సైతం ఏర్పాటు చేశారు.

వీడియోకాన్ఫరెన్స్ ద్వారా..

గ్లోబల్ సమ్మిట్‌కు పెద్ద సంఖ్యలో అతిథులు హాజరు కానుండటంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. సభా ప్రాంగణాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

నిరంతరం పర్యవేక్షణ

గ్లోబల్ సమ్మిట్ విజయవంతం చేసేందుకు 25 శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, పలు శాఖలకు డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, జిల్లా యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ సమ్మిట్ పూర్తయ్యేవరకు వీరంతా కూడా అతిథులు అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోనున్నారు. అన్ని శాఖల అధికారులకు రిమోట్‌లను అందజేశారు. ఎప్పటికప్పుడు ఏయే ప్రాంతాల్లో ఏమీ కావాలన్న అంశాలపై సమాచారాన్ని అందుకుని సేవలందించేందుకు సిద్ధం చేస్తున్నారు.

దార్శనికతను ప్రతిబింబించేలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమ్మిట్ విచ్చేసే అతిథులకు వివరించేందుకు, తెలంగాణ దార్శనికతను ప్రతిబింబించేలా ప్రభుత్వం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసింది. మూసీ ప్రక్షాళన, తెలంగాణ పారిశ్రామిక విధానం, హైదరాబాద్‌లోని మెట్రో, పలు శాఖలకు చెందిన సంక్షేమ పథకాలు, హైదరాబాద్ నగరంలోని అంతర్జాతీయ స్థాయి సంస్థలు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు, మెఘా, క్రెడాయ్, ఐకాం, తదితర దిగ్గజ సంస్థలకు చెందిన స్టాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ శశాంక నేతృత్వంలో చేపట్టిన పనులను ఆదివారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాయంత్రం సుమారు 31 డ్రోన్లతో పోలీసు అధికారులు ప్రాంగణంలో రిహార్సల్ చేశారు. దీంతో పాటు కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్లోబల్ సమ్మిట్ పనులను పరిశీలించి నగరానికి వెళ్లిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాత్రి 8గంటలకు తిరిగి సమ్మిట్ ప్రాంగణానికి చేరుకున్నారు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.



వీఐపీ ద్వారం



వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు



బందోబస్తులో స్థానిక పోలీసులు

పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

యాచారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని, పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే వేటు తప్పదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని మంతన్ గౌరెల్లిలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ లైన్ దాటి నామినేషన్ వేసిన వారు తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశానుసారంగా కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు. మాల్‌లో పార్టీ బలపరిచిన సుబానికి వ్యతిరేకంగా మాజీ జెడ్పీటీసీ జంగమ్మాయాదయ్య కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థిని సర్పంచ్ ఎన్నికలకు ప్రతిపాదించడం దారుణమన్నారు. పార్టీకి భిన్నంగా నడచుకోవడంతో వారిని జిల్లా అధ్యక్షుడి ఆదేశానుసారం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ యాచారం మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్

ఒక సర్పంచ్, 45 వార్డులు ఏకగ్రీవం

షాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి షాబాద్ మండలంలో ఒక సర్పంచ్, 45 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలో 41 గ్రామ పంచాయితీలు, 352 వార్డు మెంబర్లకు, చర్లగూడ సర్పంచ్, 45 వార్డు మెంబర్లు ఏకగ్రీవం అయ్యాయి. బరిలో 40 గ్రామ పంచాయతీలకు 111 సర్పంచ్ అభ్యర్థులు, 352 వార్డు స్థానాలకు 794 మంది ఎన్నికల బరిలో నిలిచారని ఎన్నికల అధికారులు తెలిపారు. గ్రామాల్లో నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారం ఊపందుకుంది.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): హిమాయత్ నగర్‌లో పేదలకిచ్చిన భూముల జోలికి పోవొద్దని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్‌కు చెందిన గ్రామస్తులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిశారు. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 151లోని ప్రభుత్వ స్థలంలో 60 గజాల చొప్పున ఇళ్ల పట్టాలను ఇచ్చిందని.. ఇప్పటి ప్రభుత్వం ఆ భూమిని తీసుకునేందుకు ప్రయత్నిస్తుందని గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో చంద్రకళకు ఫోన్ చేసి మాట్లాడారు. భూమి చదును చేసే పనులను వెంటనే ఆపాలని, ఈ విషయంలో కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ హిమాయత్ నగర్‌లోని 151 సర్వేలో పట్టాలు ఉన్న పేదలందరూ ఇళ్లు నిర్మించుకునేంత వరకు అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ముదిగొండ రవియాదవ్, షాబాద్ శ్యాంరావు, షాబాద్ మధు, యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, మల్కాపురం నర్సింహారెడ్డి, కుమ్మరి శ్రీను, కట్టమీది శ్రీను, కట్టమీది ప్రకాష్, జల్లెల మల్లేష్ యాదవ్, రెడ్డిపల్లి సుమన్, నాగేష్ గౌడ్, షాబాద్ గిరి, పద్మరావు గౌడ్, ప్రకాష్, గోపాల్ నాయక్, అన్సుల్, కృష్ణ, మహ్మద్ అఖీల్, కంజర్ల రాజు, ముదిగొండ శ్రీనివాస్ యాదవ్, తదితరులు ఉన్నారు.



పోమాల్‌పల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న సీఐ నరహరి

సంగ్రామం 2025

www.andhrajyothy.com

ఒకటే ఊరు.. రెండు పంచాయతీలు





మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అదంతా ఒకే ఊరు.. ప్రత్యేక పంచాయతీగా విభజించేటప్పుడు అధికారుల సాంకేతిక తప్పిదంతో గ్రామం ముక్కలైంది. సగం ఊరు ఒక పంచాయతీగా.. మరో సగం మరో పంచాయతీకి అనుబంధంగా కొనసాగుతోంది. ఫలితంగా ఇక్కడ అభివృద్ధి ఎండమావిలా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెద్దమంగళారం పంచాయతీకి అనుబంధంగా కొనసాగిన ఎల్కగూడ గ్రామాన్ని 2018లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. మిగతా సగం గ్రామం కుత్బుద్దీన్‌గూడ పంచాయతీలో కొనసాగుతోంది. ఎల్కగూడ అంతా పంచాయతీ కిందకు తేవాలని గ్రామస్థులు ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు లేరు. ప్రస్తుతం ఎల్కగూడ సర్పంచ్ పదవిని జనరల్ మహిళకు రిజర్వు చేశారు. గ్రామంలో మొత్తం ఆరు వార్డులున్నాయి. కుత్బుద్దీన్‌గూడ సర్పంచ్ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించగా ఇక్కడ మొత్తం ఎనిమిది వార్డులున్నాయి. వీటిలో రెండు వార్డులు సగ భాగం ఎల్కగూడలో ఉన్నాయి.

బాబ్బాబు జర తప్పుకోవా..



రెబల్ అభ్యర్థులకు బుజ్జగింపులు

కులకచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ నెల 17న జరిగే మూడో విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు విరమించుకునే సమయం మంగళవారంతో ముగియనుండటంతో ప్రధాన పార్టీల్లో రెబల్స్ గుబులు పట్టుకుంది. కులకచర్ల మండలంలో మొత్తం 33 పంచాయతీలు ఉండగా 144 మంది, 280 వార్డులకు 576 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒక్కో పంచాయతీలో ఇద్దరి నుంచి ఎనిమిది మంది వరకు నామినేషన్ వేశారు. మండలంలోని బోట్యానాయక్ తండాలో సర్పంచ్‌గా సంతోష్, వార్డు సభ్యులకు ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో దాదాపు ఏకగ్రీవం అయినట్లే. తిరుమలాపూర్‌లో సర్పంచ్‌కు మాధవి ఒక్కరే నామినేషన్ వేయగా వార్డులకు ఇద్దరు, ముగ్గురు నామినేషన్లు వేశారు. రెబల్స్ అభ్యర్థులను బుజ్జగించే ప్రయత్నంలో పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. ఎలాగైనా మండలంలో అధిక స్థానాలు గెలిచి బీఆర్ఎస్ సత్తా చాటాలని నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గెలుపొంది పట్టు సాధించాలని బీజేపీ చూస్తోంది. స్వతంత్ర అభ్యర్థులు మాత్రం విరమించుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఎలాగైనా ఒప్పించాలని ఆయా పార్టీల నాయకులు బుజ్జగింపులు మొదలు పెట్టారు.

బొంరెడ్డిపల్లిలో తప్పని పోటీ

» సర్పంచ్ పదవికి కుదరని ఏకాభిప్రాయం



కులకచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు అభ్యర్థుల మధ్య పోటా పోటీ ఏర్పడింది. మండలంలోని బొంరెడ్డిపల్లి(జనరల్ మహిళ) పంచాయతీ సర్పంచ్ పదవికి అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు పోటీ పడ్డారు. దీనిపై గ్రామ పెద్దలు మూడు రోజుల క్రితం పోటీ చేసే అభ్యర్థులతో సమావేశమయ్యారు. గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం పెండింగ్‌లో ఉందని, సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసి వచ్చే డబ్బుతో పూర్తి చేద్దామని నిర్ణయించారు. అందుకు ఓ అభ్యర్థి రూ.10 లక్షలు ఇస్తానని ముందుకొచ్చారు. మరో అభ్యర్థి రూ.13 లక్షలు ఇస్తామని ప్రకటించినా మరో అభ్యర్థి అంగీకరించకపోవడంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒకే పార్టీలో ఇద్దరు పోటీ పడుతూ నామినేషన్ వేశారు. ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దిగి రాజీకుదిర్చితే బాగుంటుందని గ్రామస్థులు అభిప్రాయ పడుతున్నారు.



ముమ్మరంగా వాహనాల తనిఖీ

చౌదరిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ వద్ద పరిగి - షాద్‌నగర్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రెవెన్యూ, పోలీస్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కడ్తాలలో పోటాపోటీ

సర్పంచ్ బరిలో భిక్షపతి, ఆనంద్

» 14 వార్డుల్లో ఒకటి ఏకగ్రీవం
» 13 వార్డులకు 46 మంది పోటీ
» గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
» జోరుగా ఇంటింటి ప్రచారం
» ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఎత్తుగడలు



కడ్తాల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా చైతన్యం కలిగి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కడ్తాలలో పంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. సర్పంచ్ పదవిని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో అభ్యర్థులు ప్రచారాలపై దృష్టి సారించారు. జిల్లాలో మేజర్ పంచాయతీల్లో ఒక్కటైన కడ్తాల సర్పంచ్ పీఠాన్ని దక్కించుకోవాలని ఇరు పార్టీలు పోరుకు దిగాయి.

ఏడుగురిలో ఐదుగురి ఉపసంహరణ

5,573 మంది ఓటర్లు ఉన్న కడ్తాలలో పురుషులు 2,821, స్త్రీలు 2,751 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. 14 వార్డులు కలిగిన కడ్తాల్ పంచాయతీని రిజర్వేషన్లలో భాగంగా ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. సర్పంచ్ పదవికి మొత్తం ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకోగా పోటీలో ఇద్దరు ఉన్నారు. కాగా, 14 వార్డులకు ఒకటి ఏకగ్రీవం కాగా 13 వార్డులకు 46 మంది బరిలో ఉన్నారు. సర్పంచ్ అభ్యర్థులుగా అధికార కాంగ్రెస్ మద్దతుతో మాజీ వార్డు సభ్యుడు రాయికంటి భిక్షపతి, బీఆర్ఎస్ మద్దతుతో బావండ్లపల్లి ఆనంద్ పోటీలో నిలిచారు. బరిలో నిలిచిన ఇద్దరూ స్థానికంగా గుర్తింపు ఉన్న వారు కావడంతో ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారోనని చర్చ కొనసాగుతుంది.


రాయికంటి భిక్షపతి


బావండ్లపల్లి ఆనంద్

జోరందుకున్న ప్రచారం

కడ్తాల సర్పంచ్ స్థానాన్ని చేజిక్కుంచుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ సర్వశక్తులొడ్డుతున్నాయి. ఇప్పటికే భిక్షపతి, ఆనంద్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక్కడ జన బలంతోపాటు ధన బలం రాజకీయాలను శాసించే పరిస్థితి ఉంది. కడ్తాల సమీపంలో పోర్త్ సిటీ ఏర్పాటు, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం, కొత్తగా వెంచర్లు వెలుస్తుండడం, భూముల ధరలు ఎకరా మూడు కోట్లకు పైగా పలుకుతుండడంతో కడ్తాల సర్పంచ్ పదవికి మునుపెన్నడూ లేని విధంగా పోటీ నెలకొంది. కడ్తాల సర్పంచ్ పదవి చేజిక్కించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మంతనాలు మొదలు పెట్టారు. బీజేపీ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్‌కు మద్దతు తెలుపుతున్నారు. భిక్షపతి గతంలో రెండు సార్లు వార్డు సభ్యుడిగా పనిచేయగా, ఆనంద్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. కాగా, కడ్తాలలో ఈ నెల 14న ఎన్నికలు జరుగనున్నాయి.

3,678 నామినేషన్లు

పూర్తయిన తుదివిడత నామినేషన్ల పరిశీలన

» ఆరు వార్డు సభ్యుల నామినేషన్ల తిరస్కరణ
» డబుల్ సెట్లను ఒకే సెట్‌గా గుర్తింపు
» 157 సర్పంచ్ స్థానాలకు 740, 1,340 వార్డులకు 2,938


కులకచర్ల క్లస్టర్‌లో నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

పరిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిగి సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పత్రాల పరిశీలన పూర్తయింది. స్క్రూటినీ అనంతరం నామినేషన్ల సంఖ్య 3,678గా తేలింది. పరిగి, దోమ, పూడూరు, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో మొత్తం 157 పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు 909, 1,340 వార్డుల స్థానాలకు మొత్తం 3,964 నామినేషన్లు దాఖలు అయిన సంగతి విదితమే. వీటిని ఆయా క్లస్టర్ కేంద్రాల్లో అధికారులు పరిశీలించారు. అలాగే వార్డు సభ్యులకు ఆరు నామినేషన్లను తిరస్కరించారు. కులకచర్ల మండలం రాంపూర్‌లో ఎనిమిదో వార్డుకు శంకర్ వేసిన నామినేషన్‌ను తిరస్కరించారు. ఘణాపూర్ పంచాయతీ పరిధిలోని 9వ వార్డులో దయ్యాల హన్మంత్ నామినేషన్‌ను తిరస్కరించారు. దోమ మండలం బుద్లాపూర్ పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో రెండు నామినేషన్లను తిరస్కరించారు. పూడూరు మండలం బాకాపూర్‌లో ఆరో వార్డులో ఒక నామినేషన్ తిరస్కరణ జరిగిందని అధికారులు తెలిపారు. నామినేషన్‌ల పరిశీనలలో ఒక్కో అభ్యర్థి రెండు, మూడు సెట్లు నామినేషన్లు సమర్పించినప్పటికీ వాటిని ఒకే సెట్‌గా పరిగణనలోకి తీసుకున్నారు. పరిశీలన తర్వాత 157 సర్పంచ్ స్థానాలకు 740, నామినేషన్‌లు ఉన్నాయని తెలిపారు. వార్డు సభ్యులకు 2,938 నామినేషన్లుగా లెక్క తేలిందన్నారు. సోమ, మంగళవారాల్లో నామినేషన్‌ల ఉపసంహరణకు అవకాశం ఉంది. అయితే ఈ రెండు రోజుల్లో భారీగా నామినేషన్ల ఉపసంహరణ జరిగే అవకాశం ఉందని అధికారులు బావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఉనసంహరణల తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు.

కాంగ్రెస్‌తోనే పల్లెల్లో ప్రగతి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే పల్లెలు ప్రగతిపథంలో దూసుకుపోతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. రావిచెడ్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరేద్దాం


చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

» బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామానికి రూ.10 లక్షలు
» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వచ్చే మున్సిపాల్ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని దేవునిఎర్రవల్లి వార్డుకు చెందిన 30 మంది బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించిన గ్రామానికి ఎంపీ నిధులు రూ.10 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో గుంతల రోడ్లను పూడ్చివేస్తామని, కోతుల బెడద నుంచి ఉపషమనం కల్పిస్తామన్నారు. కోతులను పట్టుకునేందుకు ట్రక్కులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, బీజేపీ నాయకులు దేవుని శర్వలింగం, డాక్టర్ వైభవ్‌రెడ్డి, శంకర్, చీర శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, పత్తి సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, మాణయ్య, వెంకటేశ్, విఠల్‌రెడ్డి, చంద్రకాంత్, కృష్ణారెడ్డి, రవి, అభిషేక్ రెడ్డి, నరేందర్‌గౌడ్, యాదయ్య, మహేందర్, కరుణాకర్, భూపాల్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, దాయకర్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

షాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడకు చెందిన కూతురు గోపాల్ తన అనచరులతో కలిసి బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి మాణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

» జిల్లా ఎన్నికల సహాయ అధికారి మాధురి


మాట్లాడుతున్న మాధురి

ఆమనగల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు విధిగా పాటించాలని జిల్లా సహాయ ఎన్నికల అధికారిణి కుసుమ మాధురి ఆదేశించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అభ్యర్థులకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఖర్చుల వివరాలు రోజు వారీగా ఎన్నికల పరిశీలకుడు ఆంజనేయులుకు అందించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీధర్, అనంత్‌రెడ్డి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


హిమాయత్ నగర్ వాసులతో సబితా ఇంద్రారెడ్డి


పేదల భూముల జోలికి పోవద్దు

» ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): హిమాయత్ నగర్‌లో పేదలకిచ్చిన భూముల జోలికి పోవొద్దని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్‌కు చెందిన గ్రామస్థులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిశారు. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 151లోని ప్రభుత్వ స్థలంలో 60 గజాల చొప్పన ఇళ్ల పట్టాలను ఇచ్చిందని.. ఇప్పటి ప్రభుత్వం ఆ భూమిని తీసుకునేందుకు ప్రయత్నిస్తుందని గ్రామస్థులు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో చంద్రకళకు ఫోన్ చేసి మాట్లాడారు. భూమి చదును చేసే పనులను వెంటనే ఆపాలని, ఈ విషయంలో కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ హిమాయత్ నగర్‌లోని 151 సర్వేలో పట్టాలు ఉన్న పేదలందరూ ఇళ్లు నిర్మించుకునేంత వరకు అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ముదిగొండ రవియాదవ్, షాబాద్ శ్యాంరావు, షాబాద్ మధు, యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, మల్కాపురం నర్సింహారెడ్డి, కుమ్మరి శ్రీను, కట్టమీది శ్రీను, కట్టమీది ప్రకాష్, జల్లెల మల్లేష్ యాదవ్, రెడ్డిపల్లి సుమన్, నాగేష్ గౌడ్, గిరి, పద్మారావు గౌడ్, ప్రకాష్, గోపాల్ నాయక్, అన్సుల్, కృష్ణ, మహ్మద్ అఖిల్, రాజు, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

‘పక్కా’గా వైద్యం

(ఐదో పేజీ తరువాయి)



బదిలీ చేయనున్నారు. ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రం/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి రూ.19.98 లక్షల చొప్పున వెచ్చించనున్నారు. మంజూరై సొంత భవనాలు లేని ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు చాలా రోజుల తర్వాత నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. భవన నిర్మాణం పనులను తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షించనుంది.

ఆరోగ్య ఉపకేంద్రాలివే...

వికారాబాద్ జిల్లాలో పులుమామిడి, కొడంగల్ -ఏ, కొడంగల్ -బీ, దోమ-2, ముజాహిద్‌పూర్, తాండూరు బెగ్గర్స్ కాలనీ, ఘనాపూర్, కుమ్మర్‌గల్లీ, పూడూరుగల్లీ, సాయిపూర్, వడ్డెరగల్లీ, టేకులపల్లి, సిరిపురం, ఆలంపల్లి, గంగారం, కొత్తగడి, శివారెడ్డిపేటల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు స్వంత భవనాలు నిర్మించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో గుండాల, రేగడి ఘనాపూర్, తంగడపల్లి, రేగడి దోస్వాడ, బాకారం, కేతిరెడ్డిపల్లి, పెద్ద మంగళారం, శ్రీరాంనగర్, దోబీపేట్, పర్వేద, రావులపల్లి, శంకర్‌పల్లి-2, జన్వాడ, కొండకల్, మహరాజ్‌పేట్, నాగన్‌పల్లి, ఇబ్రహీంపట్నం, అంజాపూర్, హయత్‌నగర్, కమ్మగూడ, కోహెడ, సాహెబ్‌నగర్, తుర్కయాంజాల్, వనస్థలిపురం, వినాయక నగర్‌ల్లో నిర్మించనున్నారు. చింతపట్ల, కుర్మిద్ద, మాల్, సుద్దపల్లి, చెర్లకొండ, జిల్లెలగూడ, కొంగరకలాన్, ఎంపీ పటేల్‌గూడ, హర్షగూడ, తుక్కుగూడ, లెనిన్‌నగర్, మీర్‌పేట్, పెద్దగొల్లపల్లి, అత్తాపూర్, బుద్వేల్, హసన్‌నగర్, ఇందిరానగర్, ఎంఎం పహడ్, రాజేంద్రనగర్, బండ్లగూడ, హైదర్‌షాకోట్, ఖానాపూర్, కిస్మత్‌పూర్, మంచిరేవుల, మణికొండ, గచ్చిబౌలి, కొత్తగూడ, నానక్‌రాంగూడ, రాయదుర్గ, స్టేషన్ తిమ్మాపూర్‌లో కొత్త భవనాలు నిర్మించనున్నారు.

నవోదయ మోడల్ పరీక్ష

తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా నవోదయ కోచింగ్ ఇచ్చి ఆదివారం మోడల్ టెస్ట్ నిర్వహించారు. 61మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు బాలకృష్ణ, రామకృష్ణ మఠం భావ ప్రచార్ రాష్ట్ర కన్వీనర్ సూర్యప్రకాశ్ పాల్గొని ప్రసంగిస్తూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు పరీక్ష బాగా రాసి నవోదయ సీటును సాధించాలని ఆకాంక్షించారు.



నవోదయ మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఊపందుకున్న పంచాయతీ ప్రచారం

- గుర్తులతో గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ అభ్యర్థుల ప్రచారం
- అనుచరులతో కలిసి డోర్ టు డోర్ క్యాంపెయిన్
- అంతుచిక్కని ఓటర్ల నాడి



ధారూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ ఎన్నిక ప్రచారం ఆదివారం నుంచి ముమ్మరమైంది. ఉపసంహరణ గడువు ముగియటంతో బరిలోని సర్పంచ్, వార్డుల అభ్యర్థులు తమకు అధికారులు కేటాయించిన గుర్తులతో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు జరగనున్న 29 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 73 మంది పోటీ పడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు బలపరిచిన అభ్యర్థులతో ఏ పార్టీతోనూ సంబంధం లేని వారు ఉధృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తున్నారు. ఏ వార్డులో తమకు అనుకూలంగా ఉందో, ఎక్కడ ప్రతికూలంగా ఉందో గ్రౌండ్ లెవల్లో బేరీజు వేసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. ఓటర్లు మాత్రం ఎవరు వచ్చినా వారికే ఓటేస్తామని చెబుతున్నారు. అభ్యర్థులు తమ వెంట తిరిగే కార్యకర్తలు, అనుచరులకు ఉదయం నుంచి సాయంత్రం భోజనం సహా ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. కూలి లెక్కన మాట్లాడుకుని ప్రచారంలో తిప్పుకుంటున్నారు. పోలింగ్‌కు ఆదివారం వరకు సమయం ఉండటంతో ఓటర్ల నాడి అంతు చిక్కడం లేదు. సర్పంచుల కన్నా వార్డు అభ్యర్థుల మధ్య పోటీ మరింత తీవ్రంగా ఉంది. వంద నుంచి 120లోపే ఓట్లు ఉండడంతో కనీసం 60 ఓట్లు సంపాదించాలనే పట్టుదలతో వార్డు అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉప సర్పంచ్ పదవిపై ఆశున్న వారు గెలుపే ధ్యేయంగా ధ్యేయంగా రాత్రింబవళ్లు ఇంటింటి ప్రచారం సాగిస్తున్నారు.

మోమిన్‌పేట్ మండలంలో...

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ మండలంలోని 25 పంచాయతీల్లో సర్పంచ్‌లు, 222 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మోమిన్‌పేట్, టేకులపల్లి, ఎన్కతల, చక్రంపల్లి, దేవరంపల్లి, మేకవనంపల్లి, మొరంగపల్లి, వెల్చాల్, దుర్గం చెరువు, ఎన్కెపల్లి, కేసారం, కోల్కుంద తదితర గ్రామాల్లో అభ్యర్థులు ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు.

క్లాస్‌మేట్ కుటుంబానికి ఆర్థికసాయం



బాబు కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తమతో పాటు పదో తరగతి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో చనిపోవడంతో అతడి కుటుంబానికి 1996-97 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి ఉదారి బాబు అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో టెన్త్ క్లాస్‌మేట్స్ అతడి కుటుంబానికి బాసటగా నిలిచి రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్‌గౌడ్, ఉదయ్‌కుమార్, కృష్ణ, సురేష్, శ్రీశైలం, లక్ష్మి, పద్మరాణి, మంజుల, అనిత, అండాలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో



కామునిపల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలో నామినేషన్ కేంద్రాలను ఆదివారం ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. అభ్యర్థులపై అభ్యంతరాలేవీ రాకపోవడంతో కులకచర్ల, కామునిపల్లి గ్రామాల్లో ఉపసంహరణలను పరిశీలించారు. విత్‌డ్రాల సమయంలో కచ్చితంగా అభ్యర్థులే ఉండాలని సిబ్బందికి సూచించారు. అభ్యర్థి కానివారితో విత్‌డ్రాకు అవకాశం ఇవ్వొద్దని తెలిపారు. మంగళవారం సాయంత్రం 3గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు.

కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

పెద్దేముల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే సర్పంచులు, వార్డు సభ్యులుగా గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. మండలంలోని గోపాల్‌పూర్, నాగులపల్లి, తట్టెపల్లి, జైరాంతండా, ఓంప్లానాయక్‌తండా, రచ్చకట్టతండా, ఆడ్కిచర్ల తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఉచిత బస్సు, కరెంటు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు కట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. గత పాలకులు చేయలేని ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పాలనలో అమలు చేశామని చెప్పారు. కాంగ్రెస్ పథకాలనే అభ్యర్థులు ప్రచారాస్త్రాలుగా మలుచుకోవాలని, అవే తమను గెలిపిస్తాయని మనోహర్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున గ్రామాల్లో కూడా కాంగ్రెస్ సర్పంచ్‌లనే గెలిపించుకుంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ ధారాసింగ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, నర్సిములు, మల్లేశం, రియాజ్, నాగులపల్లి శేఖర్, బస్వరాజ్, నాగిరెడ్డి, నగీన రాంశెట్టి, సుమిత్రరాథోడ్, బిచ్చన్న పాల్గొన్నారు.



నాగులపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆలయాలు, మసీదుల నిర్మాణాల పేరిట రాజకీయం

దోమ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దోమ మండలంలో సర్పంచ్ ఎన్నికలు వచ్చాయంటే నాయకులకు ఆలయాలు, మసీదుల నిర్మానానికి వాగ్దానాలు ఇస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఆలయ నిర్మాణం పేరిట గ్రామస్తులను మభ్యపెట్టి కొంత డబ్బు ఇచ్చాడు. ఆలయ నిర్మాణానికి మిగతా డబ్బు గెలిచిన తర్వాత ఇస్తానని చెప్పి పురాతన ఆలయాల రెన్యూవేషన్ పనులను ప్రారంభించారు. ఎన్నికల్లో ఆలయాలు, మసీదుల పనులు గుర్తుకొస్తాయని స్థానికులు విమర్శిస్తున్నారు. మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచిస్తున్నారు.



రాష్ట్ర మహాసభలకు తరలిన సీఐటీయూ నాయకులు

తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు 7, 8, 9తేదీల్లో మెదక్‌లో నిర్వహిస్తున్న సీఐటీయూ మహాసభలకు ఆదివారం తాండూరు నాయకులు వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభల్లో సమగ్రంగా చర్చిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల అమలుపై మాట్లాడుతామని తెలిపారు. ఉపాధికి భద్రత, కనీస వేతనాల అమలు, సౌకర్యాలు కల్పన, లేబర్ కోడ్‌లతో అణచివేతలపై చర్చిస్తామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ మహాసభలకు తరలుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు

జినుగుర్తిలో ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాండూర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జినుగుర్తిలో ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ క్షేత్రంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కేర్ గ్రూప్ హస్పిటల్స్, వీఎస్‌పీ వీసీఐ అకాడమిల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హృద్రోగ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రత్యేక వైద్య సేవలు అందుబటులో లేని గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించడమే తమ లక్ష్యం అన్నారు. శిబిరాన్ని అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు భాగయ్య ప్రారంభించారు. వైద్య శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈసీజీ, 2డీ ఎకో, జీఆర్‌బీఎస్, లిపిడ్ ప్రొఫైల్, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 500మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహింఆచరు. కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు భబతోస్ బిస్వాస్, సూర్యప్రసాద్‌రావు, గోఖలే, ప్రశాంత్, ప్రకాశ్‌రావు పాటిల్, మునీందర్‌రెడ్డి, వీఎస్ఆర్.మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో సేవలందించిన వైద్య నిపుణులు

నమ్మినోళ్లే నట్టేట ముంచరు కదా?

- చాపకింద నీరులా కోవర్టులు
- పంచాయతీ పోరులో లోలోన అభ్యర్థుల గుబులు!



దౌల్తాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు కోవర్టుల టెన్షన్ గుబులు పుట్టిస్తుంది. దౌల్తాబాద్ మండలంలోని 33 పంచాయతీలు ఉండగా వాటిల్లో మూడు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. 30 పంచాయతీల్లో సర్పంచ్, వార్డు పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే అప్పటి వరకు తమతో తిరిగిన అనుచరులే తప ప్రత్యర్థులకు సమాచారం చేరవేస్తున్నారా? అనే గుబులు అభ్యర్థుల్లో మొదలైంది. వారికి కోవర్టుల భయం పట్టుకుంది. అభ్యర్థుల వెంటే ఉంటూ, వారి వ్యూహాలు, ప్రణాళికలు, ఖర్చుల వివరాలను ప్రత్యర్థి వర్గాలకు లీక్ చేస్తున్న పలువురి ఉనికిని గుర్తించిన అభ్యర్థులు తమ నీడను కూడా నమ్మలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఉప సర్పంచ్ పదవులను లక్ష్యంగా చేసుకున్న వారిని ఓడించేందుకే ఈ కోవర్టులు చురుగ్గా పని చేస్తున్నట్లు సమాచారం.

ఇజ్జత్ కా సవాల్!

దౌల్తాబాద్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గెలుపు కోసం ప్రజల మద్దతు కూడగడుతున్నారు. ప్రధాన పార్టీల తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు ఎంత ఖర్చైనా వెనకాడకుండా ఎలాగైనా గెలుపు తమదంటే తమదని ధీమాతో ముందుకు వెళ్తున్నారు. ఇదిలా ఉండగా నిత్యం అభ్యర్థుల వెంటే ఉంటూ భారీగా ఖర్చు చేయిస్తున్న కొందరు గ్రామస్తులు బయటకు వెళ్లి.. 'ఆ వాడేం గెలవడు.. వాడితో బాగా ఖర్చు చేయిద్దాం.' అని బహిరంగంగానే వ్యాఖ్యనిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామంలో ఇజ్జత్ కా సవాల్ అనే విధంగా రాజకీయ వాతావరణం నెలకొంది. ప్రచారంలో అభ్యర్థుల చుట్టూ తిరుగుతున్న కొందరు నాయకులు, కార్యకర్తలు షో రాజకీయాలు చేస్తూ, ఓట్లు రాబట్టే పనిచేయకుండా నామ్ కే వాస్తాగా ఉంటున్నారు. వీరు లేకుంటే అభ్యర్థి గెలవడన్నట్లుగా ప్రచారం చేస్తుంటంతో, ఓట్లు అడుగుతూ డబ్బు పెడుతున్న అభ్యర్థులు వారిని ఏమి అనలేక తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు అయ్యేవరకు సహిస్తేనే మంచిదనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కోవర్టులు, రెచ్చగొట్టే వ్యక్తులు, షో నాయకులతో అభ్యర్థులకు ఓటమి భయం పొంచి ఉంది.

అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత

ఘట్‌కేసర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో గల సాయిప్రగతి లే అవుట్‌లోని పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని ఆదివారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్‌లోని చిన్న చెరువు కింద గతంలో హెచ్ఎండీఏ లే అవుట్ నిర్మించారు. ఇందులో 1.17ఎకరాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. తాజాగా ఈ స్థలం తనదని ఓ వ్యక్తి ఏకంగా ప్రహరీ గోడ(ప్రీకాస్ట్ వాల్) నిర్మించాడు. దీంతో పార్కు స్థలాన్ని ఆక్రమిస్తున్నారని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన ప్రహరీని ఆదివారం కూల్చివేశారు. ఈ లే అవుట్‌పై మొదటి నుంచి అనేక ఫిర్యాదులున్నాయి. ప్రధానంగా చెరువు కింది స్థలం కావడంలో సాగు నీటి కాల్వలను మాయం చేశారని, కొందరు పట్టాదారులు తమ భూమిని విక్రయించకున్నా అందులో కలిపేసుకొని ప్లాట్లు చేశారనే ఫిర్యాదులున్నాయి. ఈ విషయమై కోర్టులో కేసు ఉండగానే లేఅవుట్‌కు హెచ్ఎండీఏ ఫైనల్ అప్రూవల్ ఇచ్చిందనే విమర్శలు సైతం ఉన్నాయి. తాజాగా ఎకరం 17గుంటల పార్కు జాగా ఆక్రమణకు దిగడంతో మరో కొత్త వివాదం తెరమీదికొచ్చినట్టయింది. హెచ్ఎండీఏ లేఅవుట్‌లో ఇవేం ఇబ్బందులని పలువురు ప్లాట్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పార్కు స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చిన ఘట్‌కేసర్ మున్సిపల్ అధికారులు

ఒకే రోజు గ్రామంలో అనారోగ్యంతో ఇద్దరి మృతి



బాలమ్మ(ఫైల్)

యాలాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకే గ్రామంలో అనారోగ్యంతో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటనలు ఆదివారం తెల్లవారు జామున యాలాలలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలమ్మ(55), కట్టెల అంతప్ప(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరిద్దరు ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఒకే రోజు గ్రామంలో ఇద్దరు మరణించడంతో గ్రామస్తులు బాధను వ్యక్తం చేశారు. కాగా మృతుల కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌లు పరామర్శించి సానుభుతి తెలిపారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధి రాంపూర్ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగాయి. ఆలయ చైర్మన్ జిల్లెల్ల పవన్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. రాంపూర్‌తో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ముగింపు వేడుకల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎంపీని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తామని రవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఊరేగింపు

- స్వామి భజనలతో మార్మోగిన పరిగి

పరిగి,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో ఆదివారం అయ్యప్ప స్వామి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. సిద్ధాంతి కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పట్టణ వీధుల గుండా కొనసాగింది. ప్రతిఏటా నిర్వహించే ఈ ఉత్సవానికి వేలాది అయ్యప్ప స్వాములు తరలొచ్చారు. వీధుల గుండా అయ్యప్ప నామ స్మరణంలో మార్మోగింది. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పరశురాంరెడ్డి, పాలాది శ్రీనివాస్, గురు స్వాములు సంపత్‌స్వామి, ప్రకాశ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో అయ్యప్ప ఊరేగింపులో స్వాములు

గ్రామ అభివృద్ధికి పాటుపడాలి

- నూతన పాలకవర్గానికి ఎంపీడీవో సృజన సాహిత్య సూచన

మోమిన్‌పేట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో సృజన సాహిత్య అన్నారు. ఆదివారం మండలంలోని టేకులపల్లి పంచాయతీ క్లస్టర్‌లో మక్తతండా ఉపసర్పంచ్‌గా జైసింగ్‌ను ఎన్నికల అధికారి సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ జగద్గురు, ఉప సర్పంచ్ జైసింగ్, వార్డు సభ్యులు పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాన్ని మందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి గౌరీశంకర్, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి మాధవి, కారోబార్ నర్సిములు, వార్డు సభ్యులు సర్దార్, పవన్, రాందాస్ పాల్గొన్నారు.



మక్తతండాలో ఉప సర్పంచ్ ఎన్నికలో ఎంపీడీవో సృజన సాహిత్య

కాంగ్రెస్ పార్టీ అనుకూల అభ్యర్థుల గెలుపు తథ్యం

- ఎన్ఎస్‌యూఐ నేత అంకిత్ అనురాగ్

తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో, అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు మెజారిటీ స్థానాలు గెలవడం తథ్యం అని ఎన్ఎస్‌యూఐ నాయకుడు అంకిత్ అనురాగ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ.. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే నియోజకవర్గంలో 25 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని, అవన్నీ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులవే అని తెలిపారు. ఇదే స్ఫూర్తిని ఎన్నికలు జరిగే పంచాయతీల్లోనూ చూపాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాండూరు నియోజకవర్గంలో మొట్టమొదటి సారి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో అత్యధిక స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులే ఎక్కువచోట్ల గెలవబోతున్నారన్నారు. కరన్‌కోట్ వంటి పెద్ద పంచాయతీ ఏక గ్రీవం కావడం ఎమ్మెల్యేపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనం అని తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి పడి యువకుడి దుర్మరణం

కులకచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి పడిపోయి యువకుడు మృతిచెందాడు. మహ్మదాబాద్ మండలం మంగంపేట్‌కు చెందిన గణేశ్ (20) శనివారం రాత్రి 11గంటల ప్రాంతంలో బైక్‌పై కులకచర్ల నుంచి నంచర్లకు వెళ్తున్నాడు. ఘనాపూర్ గేటు సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. వాహనదారులు గమనించి 108కు, పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కులకచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బైక్‌పై నుంచి పడి మృతిచెందిన గణేశ్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతుడి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య



శ్రీనివాస్(ఫైల్)

నవాబుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని నారెగూడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నారెగూడకు చెందిన చేవేళ్ల శ్రీనివాస్(36) గ్రామానికి చెందిన నాగవల్ల పెంటయ్య, మంగలి రవిలతో కలిసి శుక్రవారం ఉదయం గంగ్యాడ సమీపంలోని మూసీ నదిలో చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రమైనా శ్రీనివాస్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పెంటయ్య, రవిలను అడిగారు. శ్రీను తమతో పాటే వచ్చి ఇంటికి వెళ్తున్నాని చెప్పాడన్నారు. శనివారం ఉదయం నది వద్దకు వెళ్లి చూడగా ఒడ్డుపై శ్రీనివాస్ దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో నీటిలో దిగి గాలించగా శ్రీనివాస్ మృతదేహం బయల్పడింది. శ్రీనివాస్ సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుండ్లిక్ తెలిపారు. ఈ సంఘటనను తెలుసుకున్న చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి ఆర్థిక సాయం అందించారు.

గుంతలోకి దూసుకెళ్లిన కారు.. డ్రైవర్‌కు గాయాలు

ధారూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలోకి దూకుసుపోయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన తాండూర్-వికారాబాద్ రోడ్డులోని గట్టెపల్లితండా గేట్ సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వస్తూ గట్టెపల్లి తండా సమీప మలుపులో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకుపోయి చెట్టుకు తగిలి నిలిచిపోయింది. కారు నడుపుతున్న ఆశిష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆశిష్ కారుకు సడన్ బ్రేక్ వేయటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.



వేగంగా వచ్చి గుంతలోకి దూసుకుపోయిన కారు